ఆదోనికి చేరుకున్న బస్సు యాత్రలో మాట్లాడుతున్న నాగభూషణం

టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు

రెండు నెలల్లో శంకుస్థాపన

- పత్తికొండలో బీసీ బాలికల వసతి గృహం - రైతు భరోసా సభలో ముఖ్యమంత్రి

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/పత్తికొండ

పత్తికొండలో టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు రెండు నెలల్లో శంకుస్థాపన చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఆ యూనిట్ ఏర్పాటు కోసం రూ.10 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గురువారం పత్తికొండలోని సెయింట్ జోసెఫ్ కళాశాల మైదానంలో నిర్వహించిన రైతు భరోసా పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రకటన చేశారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి గురువారం ఉదయం విజయవాడ గన్నవరం ఎయిర్ పోర్టు నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు ఎయిర్ పోర్టుకు చేరుకున్నారు. అనంతరం ఓర్వకల్లు ఎయిర్ పోర్టు నుంచి హెలిక్యాప్టర్‌లో బయల్దేరి పత్తికొండ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు ఉదయం 9.35 గంటలకు చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి ముఖ్యమంత్రి ప్రత్యేక బస్సులో బయల్దేరి రోడ్డు మార్గాన బహిరంగ సభ వేదిక వరకు కాన్వాయి కొనసాగింది. పత్తికొండకు మొదటి సారి విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి కాన్వాయికి ఇరువైపులా రహదారి వెంబడి పెద్ద సంఖ్యలో వేచి ఉన్న ప్రజలు అభివాదం చేశారు. పత్తికొండకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రావడంతో పత్తికొండ తదితర నియోజకవర్గ పరిధిలోని చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ముఖ్యమంత్రిని చూసేందుకు ఉత్సాహం చూపారు. ఈ సందర్భంగా దారి పొడవునా ప్రజలు బారులు తీరి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని తిలకించారు. రోడ్డుకిరువైపులా తనను చూడడానికి బారులుతీరి వేచి ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి జగన్ నవ్వుతూ, నమస్కరిస్తూ కాన్వాయిలో ముందుకు సాగడంతో ప్రజలు కూడా ప్రతి నమస్కారం చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. పత్తికొండ పట్టణంలో బీసీ బాలికల వసతి గృహం లేకపోవడంతో బాలికలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని ఎమ్మెల్యే శ్రీదేవి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ... బీసీ బాలికల వసతి గృహం కోసం రూ.1.70 కోట్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. జులై, ఆగస్టులో 68 చెరువులకు నీరు నింపుతామని, లా యూనివర్సిటీకి కూడా శంకుస్థాపన చేస్తామని చెప్పారు. వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి, జిల్లా ఇన్‌ఛార్జీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, కర్నూలు ఎంపీ సంజీవ్ కుమార్, కర్నూలు మేయర్ బివై.రామయ్య, జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్, ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, బిజేంద్రానాథ్ రెడ్డి, సాయిప్రసాద్ రెడ్డి, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది, కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జెసి నారపురెడ్డి మౌర్య, ఎపి అగ్రికల్చర్ మిషన్ వైస్ ఛైర్మన్ నాగిరెడ్డి, కుడా ఛైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి, డిసిఎంఎస్ ఛైర్మన్ శిరోమణి, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి, రాష్ట్ర ఉద్యాన సలహాదారు పి.శివ ప్రసాద్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు.

మాట్లాడుతున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం, ఘన వీడ్కోలు

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డికి కర్నూలు జిల్లా పత్తికొండ హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం, వీడ్కోలు లభించింది. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండలో జరిగే వైఎస్‌ఆర్ రైతు భరోసా ఆర్థిక సహాయం పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడానికి గన్నవరం నుంచి ప్రత్యేక విమానంలో ఓర్వకల్లు విమానాశ్రయానికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. పత్తికొండ పర్యటన ముగించుకుని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రికి పత్తికొండ హెలిప్యాడ్ వద్ద ప్రజా ప్రతినిధులు, అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు.

వైఎస్‌ఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

లబ్ధిదారులతో ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే

కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలి

- ఎన్నికల హామీని మరిచిన సిఎం జగన్
- ఎపి మున్సిపల్ వరకర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

ప్రజాశక్తి - ఆదోని

మున్సిపల్, పంచాయతీ శాఖల్లో కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న కార్మిక, ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రచార జాతా గురువారం ఆదోనికి చేరుకుంది. మున్సిపల్ మైదానంలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిఎస్.రాధాకృష్ణ, ఎమ్‌డి.అంజిబాబు, ఉపాధ్యక్షులు ఈరన్న, సిఐటియు మాజీ నాయకులు లక్ష్మణ్, ఆదోని పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పిఎస్.గోపాల్, తిప్పన్న అధ్యక్షతన సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేస్తామని ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మిక, ఉద్యోగులకు ఇబ్బందికరంగా మారిన అప్కాస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. రాష్ట్రంలో 123 మున్సిపల్, కార్పొరేషన్, నగర పంచాయతీల్లో దాదాపు 40 వేల మంది కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు, 10 వేలకు పైగా సిపిఎస్ ఉద్యోగులు, వెయ్యి మందికి పైగా క్లాప్ ఆటోడ్రైవర్లు పని చేస్తున్నారని తెలిపారు. 1990 నుంచి ఎన్ఎంఆర్‌లుగా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నా ఇంతవరకు రెగ్యులర్ చేయకుండా నామమాత్రపు వేతనమిస్తూ ఇబ్బందులు గురి చేయడం తగదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, సిపిఎస్‌ను రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. గత నెల 31 నుంచి రాష్ట్రంలో ఈనెల 9 వరకు రెండు ప్రచార జాతాలు నిర్వహిస్తున్నామన్నారు. ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారం కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని, లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు సోమన్న, చిరంజీవి, కృష్ణమూర్తి, కర్రెప్ప, దేవేంద్ర, పీరా, మహిళా నాయకులు నాగలక్ష్మి, సుగుణమ్మ, కవిత, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరేష్, వెంకటేష్, శ్రీనివాసులు, గణేష్ ఉన్నారు. **ఎమ్మిగనూరు** మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించే మున్సిపల్ కార్మికుల రాష్ట్ర జాతాను ఘనంగా ఆహ్వానించారు. స్థానిక సోమప్ప సర్కిల్‌లో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, నాగేంద్ర, లక్ష్మీనారాయణ, నాగభూషణం, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.అంజిబాబు, అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ మాట్లాడారు. జాతా సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన పాటలు పట్టణ ప్రజలను అలరించాయి. నాయకులు రాముడు, సాల్మన్ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నిర్బంధం...

- సిపిఎం నాయకుల గృహనిర్బంధం

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటన సందర్భంగా గురువారం సిపిఎం నాయకులను గృహ నిర్బంధం, అరెస్టులు చేశారు. గురువారం ఉదయం 7 గంటల నుండి సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, నగర కార్యదర్శి వర్గ సభ్యులు అబ్దుల్ దేశాయ్ ,ఆవాజ్ నగర కార్యదర్శి ఎస్ఎండి షరీఫ్‌లను వన్ టౌన్ పోలీసులు గహ నిర్బంధం చేశారు. మంత్రి పర్యటన ముగించుకొన్న తరువాత మధ్యాహ్నం పోలీసులు అక్కడి నుండి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా గౌస్ దేశాయ్ మాట్లాడుతూ భారత దేశంలో రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యం కూడా లేకుండా పాలక పార్టీలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, నిరుద్యోగ సమస్య తదితర విషయాలను గురించి ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రాలను ఇచ్చుకోవడానికి కూడా అవకాశం లేకుండా ఈ ప్రభుత్వం నాయకులను ఎక్కడికక్కడ నిర్బంధించడం సరైంది కాదన్నారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాలుగేళ్లలో కర్నూలు జిల్లాకు ముఖ్యమంత్రి చేసింది శూన్యమని అన్నారు. జిల్లాలోని వేదవతి ఆర్‌డిఎస్, గుండ్రేవుల ప్రాజెక్టులను పూర్తి చేసి పంట కాలువలు తవ్వితే రైతులు వలసలు పోకుండా ఉంటారని అన్నారు. పత్తికొండ ప్రాంతంలో రైతులు ఎక్కువగా టమేటా పండిస్తారని, గిట్టుబాటు ధర లేక టమోటాను రోడ్లపై పడేస్తున్నారన్నారు. టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉన్నప్పటికీ ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. ఓర్వకల్లులో ఐటి హబ్ ఏర్పాటు చేస్తామన్నారు. దాని ఊసే లేదని తెలిపారు. పత్తికొండ ఎమ్మెల్యే కనీసం తమ ప్రాంతపు సమస్యలను వివరించి మా ప్రాంతానికి ఈ పనులు చేసి పెట్టాలని కోరడానికి కూడా నోరు రావడంలేదని అన్నారు. ప్రతిపక్ష పార్టీలు నోరు విప్పి మాట్లాడడం లేదని అన్నారు. కర్నూలులో, పత్తికొండలో సిపిఐ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. సిపిఎం, సిపిఐ, ప్రజాసంఘాల నాయకులు గృహ నిర్బంధాలు, అరెస్టులను సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ఖండించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయిని, ఇతర నాయకులను గృహ నిర్బంధం చేసిన పోలీసులు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

- అఖిలపక్ష రైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

భారతీయ మహిళా మల్లయోధులు జంతర్ మంతర్ వద్ద తమ నిరసనకు సంఘీభావం తెలుపుతూ ఎంపీ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను అరెస్టు చేయాలని అఖిలపక్ష రైతు సంఘాలు డిమాండ్ చేశాయి. గురువారం ఇన్‌ఛార్జి డిఆర్‌ఓ అనురాధకు అఖిలపక్ష రైతు సంఘాలు కలిసి వినతిపత్రం సమర్పించాయి. ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు ఖాదర్, వి.హరీష్ కుమార్, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్, ఎఐకెఎంఎస్ నాయకులు వెంకటేశ్వర్లు మాట్లాడారు. అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లలో పతకాలు సాధించి దేశానికి కీర్తి తెచ్చిన పలువురు మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లు ఏప్రిల్ నుంచి జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేస్తుంటే వారిని అక్కడి నుంచి బలవంతంగా ఈడ్చుకెళ్లి పడేయడం దుర్మార్గమని తెలిపారు. క్రీడాకారులు భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని కూడా ఆశ్రయించాల్సి వచ్చిందని చెప్పారు. న్యాయస్థానం ఈ విషయంపై విచారణ ప్రారంభించిన తర్వాత మాత్రమే, ఢిల్లీ పోలీసులు, నిందితుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై చాలా ఆలస్యంగా ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తెలిపారు. ఢిల్లీ పోలీసులు వారి నిరసన మార్చ్‌ను క్రూరంగా అణచివేసి, నిర్బంధించి, వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసి, ఆపై వారిని శాంతియుతంగా జంతర్ మంతర్ వద్ద నిరసన చేపడుతున్న ప్రదేశం నుండి బలవంతంగా తొలగించారన్నారు. ఇది పూర్తిగా అప్రజాస్వామికమని విమర్శించారు.

బిఎస్ఎన్ఎల్ ఉద్యోగుల మానవహారం

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్ : కర్నూల్ జిల్లా ఎక్స్ఛేంజ్ అవరణలో ఫిష్ సర్కిల్‌లో జాయింట్ పోరం అండ్ నాన్ ఎగ్జిక్యూటివ్ యూనియన్స్ కలసి మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిఎస్ఎన్ఎల్ ఇయు జిల్లాకార్యదర్శి ఎన్.రామరాజు అధ్యక్షత వహించారు. బిఎస్ఎన్ఎల్ఇయు అండ్ ఎన్ఎఫ్‌టిఇ యూనియన్ , ఎఐబిడిపిఎ నాయకులు ఎన్.రామరాజు ,ఆదినారాయణ, మద్దిలేటి మాట్లాడారు. మూడవ పే రివిజన్, న్యూ ప్రమోషన్ పాలసీ, బిఎస్ఎన్ఎల్‌కు అందరం కలిసి 4జి,5జి సర్వీసులను సాధించుకొని బిఎస్ఎన్ఎల్‌ను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : టెన్త్ సప్లమెంటరీ పరీక్షలు శుక్రవారం నుండి జిల్లాలో ప్రారంభం కానున్నాయి. సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డిఇఒ వెంకట రంగారెడ్డి గురువారం వెల్లడించారు. పరీక్షలను ఎలాంటి పొరపాట్లు ఇవ్వకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. జూన్ 2వ తేది నుంచి 10వ తేది వరకు ఉదయం 9:30గం.ల నుంచి మ.12:45గంటల వరకు 61 పరీక్ష కేంద్రాలలో 11,535 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్, బందోబస్తు కల్పించాలన్నారు. 61 మంది చీఫ్ సూపరింటెండంట్స్, ఫ్లయింగ్ స్క్వాడ్స్ 03, ఇన్విజిలేటర్స్ 610 మందికి విధులు కేటాయించామని, 27 స్టోరేజ్ కేంద్రాలను కూడా గుర్తించామన్నారు.

పాఠ్యపుస్తకాలు సిద్ధం : ఎంపిడిఒ

ప్రజాశక్తి-సి బెళగల్

మండలంలోని పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు సిద్దంగా ఉన్నాయని ఎంపిడిఒ రాముడు పేర్కొన్నారు. గురువారం 2023-2024 విద్యా సంవత్సరంలో మొదటి విడత 12215, రెండో విడత 19532, మొత్తానికి 31747 పుస్తకాలను విద్యావనరుల కేంద్రంలో దిగుమతి చేసుకొన్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రతి పాఠశాలకు నేటి నుండి పంపిణి చేస్తామని మండలంలో ఒకటి నుండి 10 వరకు 10379 మంది విద్యార్థులున్నట్లు తెలిపారు.

సిఎంకు ఘనంగా స్వాగతం

స్వాగతం పలుకుతున్న కలెక్టర్ సృజన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా గురువారం ఓర్వకల్ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు జిల్లా ఇన్చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హఫీజ్‌ఖాన్, డాక్టర్ జె. సుధాకర్, ఆర్థర్, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్ రెడ్డి, విశాఖ బాషా రామచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, నంద్యాల ఎస్‌పి.రఘువీర్‌రెడ్డి, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూల్ ఆర్‌డిఒ హరి ప్రసాదులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండకు బయలుదేరి వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు కర్నూలు జిల్లా పర్యటన ముగించుకొని తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్లారు.

సిఎం స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

సిఎం స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే కాటసాని

అన్నదాన సత్రానికి రూ. 50 లక్షల చెక్కును అందజేస్తున్న టిజి.భరత్

అన్నదాన సత్రానికి రూ.కోటి విరాళం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : శ్రీశైలంలోని అన్నసత్రానికి టిజివి సంస్థల జూనియర్ ఛైర్మన్ టిజి.భరత్ రూ.కోటి విరాళంను అందజేశారు. శ్రీశైలంలోని మల్లికార్జున అన్నసత్ర సంఘం టిజి.లక్ష్మీ వెంకటేష్ భవ న్ను కొత్తగా నిర్మించారు. ఇందులో 150 గదులతో డీలక్స్ రూములను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. ఈ అన్నసత్రాన్ని రాజ్యసభ మాజీ సభ్యులు టిజి వెంకటేష్ కుటుంబ సమేతంగా కలిసి గురువారం ప్రారంభించారు. అనంతరం టిజి.భరత్ మాట్లాడుతూ ఈ అన్నదాన సత్రానికి ఇప్పటికే రూ.50 లక్షలు విరాళమిచ్చామని ఇప్పుడు మరొక రూ.యాభై లక్షలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యులకు ఎలాంటి సహకారం కావాలన్నా మా టీజీవీ సంస్థల తరుపున ఎప్పుడూ ముందుండి సహకారం అందిస్తున్నట్లు టిజి. వెంకటేష్, భరత్ తెలిపారు. అన్నసత్రానికి అడగకుండానే విరాళ మిచ్చినందుకు టిజి. వెంకటేష్, భరత్‌లకు సత్రం నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం వారిని సత్రం నిర్వాహకులు ఘనంగా సన్మా నించారు. టిజి.కుటుంబ సభ్యులు, అన్నసత్రం అధ్యక్షులు శ్యామ్‌సుందర్, ఆర్యవైశ్య నాయకులు ఇల్లూరు లక్ష్మయ్య పాల్గొన్నారు.

జర్నలిస్ట్ సొసైటీ అభివృద్ధికి ముందడుగు

రాష్ట్ర కో ఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్‌ను కలిసిన హౌసింగ్ సొసైటీ బృందం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లా జర్నలిస్టు సొసైటీ అభివృద్ధికి ముందడుగు పడిందని కర్నూలు జిల్లా జర్నలిస్టు మ్యూచువల్లీ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ జనరల్ సెక్రెటరీ కె.మహేష్ పేర్కొన్నారు. ఈ మేరకు అమరావతిలో రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ రిజిస్టర్ పురుషబాబును కలిశామని తెలిపారు. కర్నూలు డిస్ట్రిక్ట్ జర్నలిస్ట్ మ్యూచువల్ ఎయిడెడ్ కో ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ జనరల్ సెక్రటరీ మహేష్, సొసైటీ జాయింట్ సెక్రటరీ హరినాథ్ రెడ్డి, డైరెక్టర్ గోరంట్లప్ప, సభ్యులు ఉరుకుంద కలిశారు. త్వరలో కార్య చరణ రూపొందిచామన్నారు. ఈ విషయమై రాష్ట్ర సొసైటీ అధికారులను కలిసి వివరాలు వెల్లడించారు. జర్నలిస్ట్ సొసైటీ అభివృద్ధికి సభ్యులు అందరి అభిప్రాయం తీసుకొని కార్య చరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సొసైటీ ఆడిట్ వివరాలు, రికార్డులు, సభ్యుల ప్లాట్ తదితర అంశాలను రాష్ట్ర సొసైటీ అధికారులకు వివరించారు. త్వరలో నూతన అడహక్ కమిటీని ఎన్నుకుంటామన్నారు. సొసైటీకి సంబంధించిన వివరాలు అందుబాటులో ఉండి తెలియజేస్తామని పేర్కొన్నారు.

రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతున్న జర్నలిస్టు నాయకులు

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ముఖ్యమంత్రికి 1104 ఉద్యోగుల విజ్ఞప్తి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు జిల్లా పత్తికొండకు వచ్చిన ముఖ్యమంత్రిని విద్యుత్ 1104 ఉద్యోగుల సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి, ఎన్.కృష్ణయ్య, కర్నూలు జిల్లా ప్రాంతీయ కార్యదర్శి బిఎన్. గణేష్, కర్నూలు టౌన్ డివిజనల్ సెక్రటరి ఎం.మధుకుమార్‌లు గురువారం కలిశారు. వారికి విజ్ఞాపన పత్రం అందజేసి కొన్ని విషయాలు ఆయన దృష్టికి తెచ్చారు. స్పందించిన సిఎం ఐఎఎస్ అధికారి ధనుంజయ రెడ్డిని పిలిచి ఏంటన్నా ఎందుకు చేయలేదని అడిగితే వారిది డిస్కాంలతో ముడిపడి ఉందని చెప్పారు. నో, నో మనం ప్రతిష్టాత్మకంగా నియమించిన వారిని మనం చేయకపోతే ఎలా అని అన్నారు. తప్పకుండా రెగ్యులర్ చేయిస్తామని సిఎం చెప్పారు. సమస్యలన్నీ ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చామని అన్నారు.

వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి, డాక్టర్ ఎ.సతీష్

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మైపర్ డైరెక్టర్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ ఆది మూలపు సతీష్ ఆధ్వర్యంలో జిల్లా వినియోగ దారుల వివాదాల పరిష్కార కమిషన్ సంయుక్తంగా మున్సిఫ్ కోర్టు కాంపౌండ్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరాన్ని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ ఉల్చాల హరిప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ అదిమూలపు సతీష్, ఇఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ హరికృష్ణారెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ కె.కిరణ్మయి, ఎండోక్రైనాలజీ నిపుణులు డాక్టర్ బి.భరత్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ సంజీవ్‌కుమార్, జనరల్ మెడిసిన్ డాక్టర్ అమృతసాయి రోగులను పరీక్షించారు. అనంతరం హరిప్రసాద్ రెడ్డి, డాక్టర్ ఎ. సతీష్ మాట్లాడుతూ.. కంటికి సోకే జబ్బులను నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్సలు చేయించుకుని చూపును మెరుగుపరచుకోవాలని తెలిపారు. గొప్ప కార్యక్రమం నిర్వహించిన డాక్టర్ సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 300 మంది కి వైద్య పరీక్షలు నిర్వహించారు. అతిథులు డాక్టర్లకు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జడ్జి కిషోర్ కుమార్, మెంబర్స్ నారాయణ రెడ్డి, నజీమ కౌసర్, సూపరిన్‌టెన్‌డెంట్ రాముడు, లక్ష్మీకాంత్ రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి కోర్టు సిబ్బంది, మైపర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభ కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఛర్మకారుల భద్రత కోసం ఉద్యమం

- ఎపిసివిఎస్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఛర్మకారుల బతుకు భద్రత కోసం ఉద్యమిస్తామని ఆంధ్రప్రదేశ్ ఛర్మకార వృత్తిదారుల సంఘం పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కర్, సుమాల ఆంథోని, కోశాధికారి సి.రాయప్ప, ఉపాధ్యక్షులు సుమాల రాజు తెలిపారు. గురువారం పట్టణంలోని శివసర్కిల్ ఎస్‌బిఐ ఎటిఎంపై ఉన్న కెవిపిఎస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈనెల 24న పట్టణంలో జరిగే ఛర్మకార వృత్తిదారుల సంఘం జిల్లా ప్రథమ మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సమాజంలో నాగరిక వ్యవస్థ వైపు అడుగులు ప్రారంభమైన తొలి నాళ్లలోనే ఛండాలురుగా ముద్రవేసి, మృతదేహాలను ఈడ్చి పడేసే అధమ స్థాయి వృత్తిలోకి దళితులు నెట్టి వేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. వివిధ రోడ్ల సర్కిళ్ల వద్ద వృత్తి నిర్వహిస్తున్న ఛర్మకారులు వృత్తి జరగక ఒకవైపు, మున్సిపల్, పోలీసు వేధింపులతో మరో వైపు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కార్మికుల్లో నైపుణ్యతను పెంచి, నిరంతర వృత్తిని కల్పించే లెదర్ పార్కును మూసేశారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న ఛర్మకారుల సమస్యలపై చర్చించి, భవిష్యత్తు భరోసా కోసం ఉద్యమించేందుకు ఈనెల 24న పట్టణంలో ఛర్మకారుల జిల్లా మహాసభలను నిర్వహిస్తున్నామని చెప్పారు. మహాసభల జయప్రదానికి అందరూ సహకరించాలని కోరారు. నాయకులు కలుగొట్ల రాజా రమేష్, గుడికల్ ఆనంద్, ఈరన్న గౌడ్, రంగప్ప పాల్గొన్నారు.

వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- అవోపా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనాథ్ గుప్త, శ్రీధర్

ప్రజాశక్తి - ఆదోని

శిబిరాన్ని ప్రారంభిస్తున్న సభ్యులు

అవోపా ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత పిల్లల వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని అవోపా అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు శ్రీనాథ్ గుప్త, కార్యదర్శి మిరియాల శ్రీధర్ కోరారు. 10 రోజులపాటు పట్టణంలోని ఆర్య వైశ్య హాస్టల్‌లో జరగనున్న ఉచిత పిల్లల వేసవి శిబిరాన్ని సౌజన్య కర్తలు, ఆర్య వైశ్య పఠనాలయం అధ్యక్ష, కార్యదర్శులు పాడేగల్ మురళీ, పాడేగల్ సనత్ గురువారం ప్రారంభించారు. శిబిరంలో అబకాస్, వేదిక్ మ్యాథ్స్, చెస్ కోచింగ్, మెహందీ డిజైన్ లాంటి ఎన్నో నైపుణ్య విద్యలను నేర్పుతున్నారన్నారు. సభ్యులు ప్రతాప్, ఈరన్న, మహిళా విభాగ్ సెక్రటరీ మమతాశ్రీ, సభ్యులు కవితశ్రీ, ప్రసన్న, తులసి, కీర్తి పాల్గొన్నారు.

ఎల్ఐసి అడ్మినిస్ట్రేటివ్ అధికారి

దస్తగిరి సేవలు మరువరానివి

- బ్రాంచి మేనేజర్ సుజిత్ కుమార్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎల్ఐసి కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా కె.దస్తగిరి సేవలు అభినందనీయమని వక్తలు తెలిపారు. గురువారం బ్రాంచి కార్యాలయంలో ఉద్యోగ విరమణ సందర్భంగా కె.దస్తగిరి, కెహనుమంతమ్మకు సన్మానం చేశారు. ఈ సందర్భంగా బ్రాంచి మేనేజర్ బి.సుజిత్ కుమార్, ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు రఘునాథ్ గౌడ్, విజయ్ కుమార్, డెవలప్‌మెంట్ ఆఫీసర్ల ఉద్యోగుల సంఘం నాయకులు సుధాకర్ రావు, ఏజెంట్ల సంఘం నాయకులు ప్రభాకర్ రెడ్డి, ఆదోని బ్రాంచి ఎల్ఐసి ఉద్యోగుల సంఘం నాయకులు ధర్మరాజు మాట్లాడారు. గత 38 ఏళ్లుగా ఎల్ఐసిలోని వివిధ విభాగాల్లో పని చేసి ఎక్కడా, ఎవరికీ సమస్య లేకుండా తన పనిని బాధ్యతగా నిర్వర్తించేవారని తెలిపారు. విరమణ పొందిన అడ్మినిస్ట్రేటివ్ అధికారి దస్తగిరి మాట్లాడుతూ... కుటుంబ సభ్యులకు, తనకు ఉద్యోగంలో అండగా నిలిచిన బ్రాంచి సిబ్బందికి, ఏజెంట్లకు కృతజ్ఞతలు తెలిపారు. మహేష్ కుమార్, గోవర్ధన్, మురళీ, శంకర్, బ్రహ్మారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిబ్బంది

బోసిబోయిన ప్రభుత్వ కార్యాలయాలు...

- ముఖ్యమంత్రి పర్యటనకు భారీగా ప్రజల తరలింపు....

ప్రజాశక్తి-ఆలూరు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండ పర్యటనలో భాగంగా నియోజకవర్గంలో ప్రభుత్వ రెవెన్యూ, మండల, సచివాలయాలు, తదితర కార్యాలయాలు అధికారులు లేక బోసిబోయాయి. గురువారం పత్తికొండలో రైతు భరోసా కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి పర్యటనకు గతవారం రోజులుగా ప్రజలను తరలించి విజయవంతం చేయాలని అధికారులు, వైసిపి నాయకులు దిశ, నిర్దేశాలు చేసి ప్రభుత్వ కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీచేశారు. గ్రామ, పట్టణ వాలంటీర్లకు ఒక్కో వాలంటీరు ఏడుగురిని తరలించాలని, ఉపాధి కార్మికులను, పొదుపు మహిళలను, పింఛనుదారులను తరలించినట్లు తెలిసింది. ప్రతి గ్రామ పంచాయతీకీ ఒకటి లేక రెండు ఆర్‌టిసి బస్సులను ఏర్పాటు చేశారు. ప్రతి బస్సుకూ ఇద్దరు అధికారులను నియమించారు. కార్యక్రమానికి వెళ్లేటప్పుడు ఉప్మాతో సరిపెట్టి, కార్యక్రమంలో తాగునీరు దొరకక మధ్యాహ్నం భోజనాలు లేక ప్రజలు, అధికారులు తిట్లపురాణంతో మండిపడ్డారు. ఆలూరుకు తిరిగి వచ్చిన మహిళలు భోజన హోటల్ దగ్గర మధ్యాహ్నం 3 గంటలైనా అన్నం కోసం పడిగాపులు కాశారు.

బోసిబోయిన తహశీల్దార్ కార్యాలయం

మధ్యాహ్న భోజనం కోసం ఆలూరు హోటల్ దగ్గర పడిగాపులు కాస్తున్న మహిళలు

గాలివాన బీభత్సం....

- నేలకొరిగిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

- విద్యుత్ శాఖకు భారీ నష్టం

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం మండలంలో గాలి వాన బీభత్సం సృష్టించింది. గురువారం భానుడు భగభగ మండి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న సమయంలో ఒక్కసారిగా గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడింది. చెట్లు విరిగి నేల మీద పడ్డాయి. ఫ్లెక్సీలు, రేకు షెడ్లు గాలిలో ఎగిరి పడ్డాయి.

విద్యుత్ శాఖకు నష్టం : ఉరుములు, మెరుపులతో గాలివాన కురవడంతో విద్యుత్ శాఖకు భారీగా నష్టం జరిగింది. మండలంలోని రౌడూరు, ఉపరాహాలు ఆయా గ్రామాల్లో 50 కంటే పైగానే విద్యుత్ స్తంభాలు నేలవాలాయి. సుమారు రూ.3 లక్షలకు పైగానే నష్టం జరిగినట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేశారు. గ్రామాలకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. విద్యుత్ శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపడుతున్నారు.

కౌతాళంలో నేలకొరిగిన చెట్లు

హోళగుందలో గాలివాన - నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

- రెండు గంటల పాటు విద్యుత్‌కు అంతరాయం

హోళగుంద : హోళగుందలో మండలంలో గాలివాన బీభత్సం సృష్టించింది. గురువారం సాయంత్రం ముందుగా గాలి వీచి, తర్వాత భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో రెండు గంటల పాటు మండలంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. తాగునీరు, చిన్న పరిశ్రమలపై ఆధారపడిన కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మామిడికాయలు కూడా నేలపాలైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంతమంది రైతులు ఈ వర్షం వల్ల తమ పొలాల్లో విత్తనాలు వేసుకుంటామని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గత నెలరోజులుగా తమ పొలాలను చదును చేసుకొని, విత్తనాలు సిద్ధం చేసి రోహిణి కార్తీలో విత్తనాలు వేయాలనుకున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ఈ రైతులకు వర్షం అనుకూలంగా మారగా మామిడి తోట రైతులకు మాత్రం తీవ్ర నష్టాన్ని మిగిలిచ్చింది. జిల్లాలో గత 15 రోజులుగా అక్కడక్కడ భారీ వర్షాలు కురిసినా, ఇక్కడ మాత్రం ఇదే మంచి వర్షమని రైతులు పేర్కొంటున్నారు. గంట పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురవడంతో పిడుగులు ఎక్కడ పడతాయోనని ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

పిడుగు పడి రైతు మృతి

ప్రజాశక్తి - కోసిగి రూరల్

మండలంలోని వందగల్లు గ్రామానికి చెందిన రైతు మాల దాసరి వీరేష్ (33) పిడుగు పడి మృతి చెందారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల మేరకు... గురువారం తన సొంత పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం రావడంతో పక్కనే పొలంలో ఉన్న చెట్టు కింద తన భార్యతో కలిసి వెళ్లి కూర్చున్నారు. భారీ శబ్దంతో ఉరుము పడడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఉరుము శబ్దంతో భార్య సైతం కళ్లు తిరిగి పడి కోమాలోకి వెళ్లారు. ఆమెను వెంటనే చికిత్స నిమిత్తం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య రత్నమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మృతి చెందిన రైతును ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన

వారిపై చర్యలు తీసుకోవాలి

- వామపక్ష, ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి ఆదోని

మహిళా రెజ్లర్లపై వేధింపులకు పాల్పడిన క్రీడా అసోసియేషన్ అధ్యక్షులు బ్రిడ్జ్ భూషణ్ చరణ్ సింగ్‌పై చర్యలు తీసుకోవాలని వామపక్ష, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం దేశవ్యాప్తంగా వామపక్ష, ప్రజాసంఘాల ఆందోళనలో భాగంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్.డి.అంజిబాబు, ఉపాధ్యక్షులు పి.ఈరన్న, సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు భరత్, శ్రీనివాసులు, వ్యకాస మండల కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. రెజ్లర్లు ఆందోళన చేపట్టి 36 రోజులు కావస్తున్నా కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం విచారకరమని తెలిపారు. క్రీడాకారులకున్న హక్కులను రక్షించాలని, వేధింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. సిఐటియు, ఎస్ఎఫ్ఐ, వ్యకాస నాయకులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

నూతనంగా ప్రతిష్ఠించిన వాల్మీకి విగ్రహం

కనకవీడు పేటలో వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన

ప్రజాశక్తి - నందవరం

మండలంలోని కనకవీడు పేట గ్రామంలో శ్రీవాల్మీకి మహర్షి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. గురువారం ఉదయం 8 గంటలకు గణపతి పూజ, గణపతి హోమం, మూల మంత్రం, నవగ్రహ పూజ, సర్వదేవత హోమం, పంచామృత అభిషేకంతో వేద పండితులు శ్రీకృష్ణ స్వామి వాల్మీకి విగ్రహ ప్రతిష్ఠాపన చేపట్టారు. ఈ సందర్భంగా వాల్మీకి కమిటీ సభ్యులు మాట్లాడారు. జనం మనదే... బలం మనదే.. ఏకమైతే విజయం మనదే..! అనే సంకల్పంతో కనకవీడు పేట ప్రజలు ఐక్యతతో ముందుకు సాగాలని తెలిపారు. గ్రామంలో వాల్మీకిల ఐక్యంగా ఉండాలని, పిల్లలను బాగా చదివించాలని కోరారు. త్వరలో జరగబోయే ఎస్టీ సాధన కోసం వాల్మీకులందరూ ఉద్యమంలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అనంతరం గ్రామస్తులు, అతిథులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కె.పేట వాల్మీకి కమిటీ సభ్యులు వీరాంజనేయులు, నాగేష్, వీరేష్, మల్లన్న, శాంతప్ప, అంజి, మారెప్ప, డీలర్ ఈరన్న, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మలేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

- అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

మలేరియా వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి చంద్రశేఖర్ తెలిపారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని బంటుపల్లి గ్రామంలో గురువారం మలేరియా అవగాహన పట్ల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ నెల 1 నుంచి 30 వరకు రాష్ట్రవ్యాప్తంగా మలేరియా మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ వంటి చర్యలు ఆరోగ్య సిబ్బందితో తీసుకున్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయి బాబా, హెల్త్ సూపర్ వైజర్లు ఈశ్వరయ్య, శ్రీధర్, ఉమబాయి, ఎఎన్ఎం రాధాబాయి, ఆశాలు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నేడు వీధి కుక్కల తరలింపు

- సర్పంచి అయ్యమ్మ

ప్రజాశక్తి - కోసిగి రూరల్

కోసిగి మేజర్ పంచాయతీలో కుక్కలు విచ్చలవిడిగా రోడ్డు మీద తిరగడంతో వీధి కుక్కలను పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామం నుంచి అడవిలోకి తరలిస్తున్నట్లు సర్పంచి ఎస్.అయ్యమ్మ తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో రోడ్లపై ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న వీధి కుక్కలు ప్రమాదకరంగా మారాయని తెలిపారు. ప్రజల విన్నపం మేరకే వీధి కుక్కలను తరలిస్తున్నట్లు చెప్పారు. సొంతంగా ఇంటి కుక్కలుంటే వాటి గొంతులో ఏదో గుర్తు వేసుకొని ఇంటి దగ్గర ఉంచుకోవాలని కోరారు.

గడ్డివామి దగ్ధం

ప్రజాశక్తి - హొలహొర్వి

హాలహర్వి మండలం పచ్చారపల్లి గ్రామంలో షేక్ ఆలం బాష అనే రైతు వరిగడ్డి, జొన్న సొప్ప గడ్డివామికి బుధవారం అర్ధ రాత్రి 1 గంట సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించారు. గడ్డివామి పూర్తిగా కాలి బూడిదైంది. దాదాపు రూ.లక్ష నష్టం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పేలోపు మొత్తం కాలిపోయి బూడిదయింది. పశువులంటే ప్రాణమని, వాటిని అమ్మలేక, వరి గడ్డి కొనలేక చాలా ఇబ్బందుల్లో ఉన్నామని రైతు తెలిపారు. ప్రభుత్వం వరిగడ్డి కానీ, దాణా కానీ ఇచ్చి ఆదుకోవాలని కోరారు.

దగ్ధమవుతున్న గడ్డివామి

తిక్కారెడ్డి ఆధ్వర్యంలో

టిడిపిలో చేరిన అశోక్ రెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలోని వైసిపి పట్టణ ప్రధాన కార్యదర్శి పాటిల్ అశోక్ రెడ్డి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. గురువారం స్థానిక శాంతినికేతన్ రెసిడెన్సిలో టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి అధ్యక్షతన అశోక్ రెడ్డితో పాటు ఆయన అనుచరులను టిడిపి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర నుంచి పార్టీలోకి వలసలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి వెన్నుదన్నుగా సుమారు 35 ఏళ్ల సేవలు అందించిన అశోక్ రెడ్డి వైసిపి పాలనలో అభివృద్ధి లేదని, అనుభవం గల చంద్రబాబు నాయుడు వల్ల రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని భావించి టిడిపిలోకి చేరారని తెలిపారు. ఆయనకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అశోక్ రెడ్డితో పాటు హరిజన వెంకటేష్, భీందాస్, మున్నా డేవిడ్, వెంకటేష్‌లు టిడిపిలో చేరారు. టిడిపి ఎంపిటిసి వెంకటేష్, నాయకులు విజయరామిరెడ్డి, చెట్నేహళ్లి మాజీ ఎంపిటిసి ఈరన్న, వట్టేప్పగారి సుంకప్ప, వట్టేప్ప గారి నరసింహులు, వనికె నాగరాజు, కలుదేవకుంట రాగన్న, ఏబు, పౌలు, శివ పాల్గొన్నారు.

తిక్కారెడ్డి గెలుపునకు కృషి

- టిడిపి నాయకులు పాటిల్ అశోక్ రెడ్డి

రానున్న ఎన్నికల్లో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి గెలుపు కోసం సాయశక్తులా కృషి చేస్తామని పాటిల్ అశోక్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైసిపి పాలనలో కేవలం సంక్షేమానికే ప్రాధాన్యత ఇవ్వడం వల్ల మౌలిక వసతుల కల్పనలో విఫలం చెందిందని విమర్శించారు. అనుభవజ్ఞుడైన చంద్రబాబు ద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో టిడిపిలో చేరామని తెలిపారు. ఎమ్మెల్యే కుటుంబానికి గత 35 ఏళ్లుగా పని చేస్తున్నా తగిన గుర్తింపు లేదన్నారు. పైగా తన ఆత్మగౌరవం దెబ్బ తీశారని ఆవేదన వ్యక్తం చేశారు. కలత చెందిన తాను తిక్కారెడ్డిని కలిసినట్లు తెలిపారు. పార్టీలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తిక్కారెడ్డి గెలుపునకు, టిడిపి విజయానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కండువా వేసుకోగానే బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

తిక్కారెడ్డి ఆధ్వర్యంలో టిడిపిలో చేరుతున్న అశోక్‌రెడ్డి

ప్రభుత్వ వైఖరి మారకపోతే

గుణపాఠం తప్పదు...

- ఎపి జిఈఎ జిల్లా అధ్యక్షులు బండి శ్రీధర్

- ఆదోనిలో దీక్ష చేపట్టిన ప్రభుత్వ ఉద్యోగులు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకపోతే గుణపాఠం తప్పదని ఎపి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు బండి శ్రీధర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్‌లో ఎపి జిఈఎ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారం కోసం తాలూకా అధ్యక్షులు ఎస్.ఎ.రషీద్ ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షలకు ఆయా ప్రభుత్వ శాఖల్లో పని చేసే ఉద్యోగులు భారీగా తరలివచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన బండి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి సురేష్ రెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాజకీయ హామీగా పాదయాత్రలో ఇచ్చిన వాగ్దానాల్లో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. ప్రతినెలా ఉద్యోగులు జీతాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. డిఎలు సకాలంలో చెల్లించకపోగా వాటిని పెండింగ్ పెడుతూ అరియర్స్‌ను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీ జీతం పొందడం హక్కు అని, దీనిపై చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. 11వ పిఆర్‌సిలో బకాయి పడ్డ డిఎలు, అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. ఉద్యోగులు దాచుకున్న సొమ్ముకు భద్రత కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. కర్నూలు సిటీ అధ్యక్షులు మురళీధర్ నాయుడు, ఆదోని తాలూకా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు నాగ రవి, ఎల్లయ్య, రాధాకృష్ణ, వేణు, నబి రసూల్, లక్ష్మి, ఇందిరా, దోరతి, వీరేష్, గోపాల్ పాల్గొన్నారు.

దీక్షలు చేపడుతున్న ప్రభుత్వ ఉద్యోగులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని రామతీర్థం కొండ సమీపంలో ఆదోని, పత్తికొండ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో హరిజన హనుమంతు (28)కు గాయాలయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు... శంకరబండ గ్రామానికి చెందిన హరిజన హనుమంతు గురువారం పని నిమిత్తం ఆస్పరికి వచ్చారు. పని ముగించుకొని బైక్‌పై గ్రామానికి వెళ్తుండగా ఆదోని నుంచి గుత్తికి వెళ్తున్న లారీని ఢీ కొట్టారు. హనుమంతు ఎడమ కాలు విరిగింది. హనుమంతును ఆస్పరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ కూడా వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వాస్పత్రి తరలించారు. ఈయనకు భార్య అరుణ, కుమార్తె ఉన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు.

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ...

మంత్రాలయం చేరిన బైక్ యాత్ర

ప్రజాశక్తి - మంత్రాలయం

రాజుతో మాట్లాడుతున్న నాయకులు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం ఎల్లంకి మండలం అన్నవరం గ్రామానికి చెందిన రాజు చేపట్టిన బైక్ యాత్ర గురువారం మంత్రాలయం చేరుకుంది. రానున్న ఎన్నికల్లో వైసిపి ప్రభంజనం సృష్టించి మరోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలని గత నెల 14న నెల్లూరు జిల్లా నుంచి బైక్ యాత్ర చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 175 నియోజకవర్గాల మీదుగా సాగుతోందన్నారు. 44 నియోజకవర్గాలు పూర్తి చేసుకుని ఆలూరు, ఆదోని, ఎమ్మిగనూరు మీదుగా మంత్రాలయం చేరుకున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, రాంపురం రెడ్డి సోదరుల ఆదేశాల మేరకు మంత్రాలయం సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో బైక్ యాత్ర చేపట్టిన రాజుకు ఘన స్వాగతం పలికారు. ముందుగా పూలమాల వేసి శాలువాతో సన్మానించి అభినందించారు. బైక్ యాత్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ యాత్ర సాగించడం అభినందనీయమని సర్పంచి భీమయ్య కొనియాడారు. 2024 ఎన్నికల్లో తప్పకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో పాటు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి కూడా అత్యధిక మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం రాజుకు కొంత ఆర్థిక సహాయాన్ని సర్పంచి భీమయ్య అందించారు.

కనిపించని స.హ. చట్టం బోర్డు

ప్రజాశక్తి-ఆలూరు

ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచి సమాచారాన్ని అడిగి తీసుకొనే అధికారమే సమాచార హక్కు. బాధితునికి కావాల్సిన సమాచారాన్ని రాబట్టడం కష్టతరమైన నేపథ్యంలో భారత ప్రభుత్వం 2005 అక్టోబర్ 13న దేశమంతా ఈ సమాచార హక్కు చట్టం తీసుకొచ్చింది. ప్రభుత్వ సంస్థల కార్యాలయాల ముందు సమాచార హక్కు చట్టం బోర్డు, అధికారుల వివరాలు పొందుపర్చాలని ఆదేశాలున్నాయి. ఇప్పటికీ కార్యాలయాల ముందు బోర్డు ఉంచకపోవడం అధికారుల అవివేకమా, నిర్లక్ష్యమా అని ప్రజలు పేర్కొంటున్నారు. ఆలూరులోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో అసిస్టెంట్ ఇంజినీరింగ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ కార్యాలయం ముందు సమాచార హక్కు చట్టం బోర్డు కనిపించడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వ, ప్రభుత్వ సంస్థల కార్యాలయం ముందు సమాచార బోర్డును ఏర్పాటు చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు.

ఆలూరు విద్యుత్ శాఖ కార్యాలయం


లబ్ధిదారులకు రైతు భరోసా చెక్కును అందజేస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్
- మహిళా రెజర్లకు మద్దతుగా సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన
- బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ దిష్టిబొమ్మ దహనం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్

ప్రజాశక్తి - నంద్యాల

అంతర్జాతీయంగా భారతదేశానికి కుస్తీ పోటీల్లో పథకాలు సాధించి పెట్టిన రెజ్లర్లపై లైగింక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేసిన కఠినంగా శిక్షించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.రమేష్ కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రెజ్లర్లకు మద్దతుగా సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారం నంద్యాల పద్మావతి నగర్ ఆర్చి వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినా ఇంతవరకు బిజెపి ఎంపీని అరెస్టు చేయకపోవడం దారుణమన్నారు. మే 28న ప్రజాస్వామ్య దేవాలయం పేరుతో నూతన పార్లమెంటు భవనాన్ని ప్రారంభించిన మోడీ ప్రజాస్వామ్య యుతంగా జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తున్న క్రీడాకారులపై పాశవికంగా వారిని ఈడ్చుకుంటూ, ధర్నా శిబిరాన్ని ధ్వంసం చేసి అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. రెజ్లర్లు 40 రోజులుగా ఆందోళన చేస్తున్న ప్రభుత్వం పట్టించు కోకపోవడంతో వారు పతకాలను గంగలో కలిపేస్తామని అంటున్నా ఈ ప్రభుత్వానికి సిగ్గు లేదన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడ్డ ఎంపీ పార్లమెంటు భవనం ముందు ఫోజులిస్తుంటే దేశ ప్రజలు సిగ్గుతో తలదించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. కుస్తీయోధులకు దేశ వ్యాప్తంగా రైతాంగం, కార్మిక వర్గం, మహిళలు, మేధావులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. అంతర్జాతీయ క్రీడాకారులు కూడా మద్దతు తెలపాలన్నారు. బేటి పడావో బేటి బచావో నినాదం కేవలం ప్రచారానికే పరిమితమై, మహిళలపై ఇలాంటి వేధింపులు జరుగుతున్నా బిజెపి ఎంపీని కాపాడుకోవడానికి ఎలాంటి చర్యలు తీసుకోపోవడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బిజెపి ఎంపీని అరెస్ట్ చేసేంతవరకు వారి ఆందోళనకు పార్టీ, ప్రజాసంఘాలు సంపూర్ణ మద్దతు ఉంటుందని, ప్రజలందరూ వారికి మద్దతుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహ, సిఐటియు జిల్లా నాయకులు తోటమద్దులు, కెఎండి గౌస్, పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఓ లక్ష్మణ్, నాయకులు వెంకట లింగం తదితరులు పాల్గొన్నారు. **నందికొట్కూరు :** రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నాగేశ్వరావు డిమాండ్ చేశారు. నందికొట్కూరులో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సిపిఎం, బిఎస్‌పి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాస్తారోకో చేసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ (మిగతా 6వ పేజీలో..)

వైఎస్ఆర్ రైతు భరోసా జమ

- 2,19,791 మంది రైతులకు రూ. 120.97 కోట్లు : కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

వైఎస్సార్ రైతు భరోసా 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలి విడత పెట్టుబడి సాయం కింద 2,19,791 మంది రైతులకు రూ.120.97 కోట్లు నేరుగా జమ చేశామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ వెల్లడించారు. గురువారం కర్నూలు జిల్లా పత్తికొండ పట్టనంలో బహిరంగ వేదిక నుంచి వరుసగా 5వ ఏడాది మొదటి విడతగా వైయస్సార్ రైతు భరోసా, పిఎం కిసాన్, మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో కురిసిన అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ కింద తొలివిడతగా 52.31 లక్షల మందికి రూ.3,934.25 కోట్లు జమ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి కంప్యూటర్ బటన్ నొక్కి ప్రారంభించారు. నంద్యాల కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్లో వర్చువల్ విధానం ద్వారా జిల్లా కలెక్టర్ మనజిర్ జిలాని సమూన్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రావు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు ఈ కార్యమ్రాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 45,607 మంది రైతులకు రూ.25.08 కోట్లు, బనగానపల్లిలో 42,005 మందికి రూ. 23.11 కోట్లు, డోన్‌లో 36,429 మందికి రూ.20.04 కోట్లు, నందికొట్కూర్‌లో 29,543 మందికి రూ.16.24 కోట్లు, నంద్యాలలో 24,527 మందికి రూ.13.50 కోట్లు, పాణ్యంలో 14,456 మందికి రూ.7.95 కోట్లు, శ్రీశైలంలో 27,224 మందికి రూ.15.02 కోట్లు రైతు భరోసా మొత్తాలను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మాట్లాడుతూ పంట ఉత్పాదకత కోసం నాణ్యమైన వనరులను, సేవలను సకాలంలో సమకూర్చుకొని అవసరమైన పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం ఖరీఫ్ సీజన్లో వైయస్సార్ రైతు భరోసా మొత్తాలను రైతులకు అందిస్తోందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కౌలు దారు రైతులకు కూడా ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని తెలిపారు. భూముల పరిమాణంతో సంబంధం లేకుండా సమిష్టిగా సాగుభూమి కలిగి ఉన్న యజమాని రైతు కుటుంబాలకు సంవత్సరానికి 13,500 రూపాయల ప్రకారం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందని చెప్పారు. అనంతరం జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ తదితరుల చేతుల మీదుగా రైతులకు వైఎస్సార్ రైతుభరోసా చెక్కును అందచేశారు. అనంతరం వైఎస్ఆర్ సెంటినరీ ఆవరణలో ఏర్పాటు చేసిన వ్యవసాయ వ్యవసాయ అనుబంధ రంగాల స్టాళ్లను వారు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రవాణా రంగం బతకాలంటే ప్రభుత్వాల దోపిడీ విధానాలు మారాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, రోడ్డు రవాణా భద్రతా చట్టం రద్దు చేయాలని ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. ఆలిండియా రోడ్ ట్రాన్స్‌ఫోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ జెండాను ఆయన ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి గాజులపల్లి ఆటో యూనియన్ కార్యదర్శి సుంకన్న అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్ టిడబ్ల్యూఎఫ్ గత 50 సంవత్స రాలుగా రవాణా రంగం కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల కోసం రాజీలేని పోరాటాలు నిర్వహిస్తూ అండగా నిలుస్తుందన్నారు. రవాణా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దోపిడీ విధానాలతో చావుదెబ్బ తీస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలకు అవసరమైన పెట్రోల్, డీజిల్, గ్రీసు, ఆయిల్ వంటి ఉత్పత్తులు, ఇతర విడిభాగాల ధరలు, వాహన పన్నులు, టోల్ చార్జీలు విపరీతంగా పెంచుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రవాణా రంగాన్ని కుదేలు చేస్తుందని అన్నారు. ఒకే దేశం ఒకే పన్ను అంటూ జిఎస్టి విధానం తెచ్చారని, పెట్రోల్, డీజిల్‌పై అమలు చేయకపోవడంలో ఉన్న మతలబు ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు రవాణా రంగంపై భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, ఈఎస్ఐ, పిఎఫ్‌తో పాటు 60 సంవత్సరాలు నిండిన డ్రైవర్లకు పెన్షన్ సౌకర్యం, జాతీయ రహదారులపై ప్రతి వంద కిలోమీటర్లకు ఒకచోట రెస్టు రూములు, నీటి వసతి కల్పించాలని డిమాండ్ చేశారు. వీటి సాధన కొరకు ఫెడరేషన్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్న దని, పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులను కోరారు. కార్యక్రమంలో సుంకన్న, మాస్టర్ నరసింహ, కుమార్, లక్ష్మినరసింహ, బాలస్వామి, అమీర్, ఆయూబ్, ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు లక్ష్మణ్

పిడుగు పడి విద్యార్థి మృతి

- గడివేముల మండలంలో ఇద్దరికి అస్వస్థత
- కొత్తపల్లి మండలంలో గాలివాన బీభత్సం
- నేలకొరిగిన భారీ వృక్షం, విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పిడుగు పడి విద్యార్థి, పాడిగేదె మృతి చెందిన సంఘటన ఉయ్యాలవాడ మండలం తుడుమెలదిన్నె గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. తుడుమెలదిన్నె గ్రామానికి చెందిన ఓబయ్య, ఓబులమ్మ దంపతుల కుమారుడు చక్రవర్తి(18) ఇంటర్ పూర్తి చేశాడు. వేసవి సెలవులు కావడంతో బర్రెలను మేపడానికి చక్రవర్తి పొలానికి వెళ్లాడు. మధ్యాహ్నం తర్వాత ఉన్నట్లుండి ఉరుములు, మెరుపులతో సమీపంలోనే పిడుగు పడింది. దీంతో ఒక పాడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. చక్రవర్తి సృహ తప్పి పడిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి వెంటనే చక్రవర్తిని కోవెలకుంట్ల ఉదయానంద వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మరణించినట్లు తెలిపారు. చక్రవర్తి మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

పిడుగు శబ్దానికి ఇద్దరికి అస్వస్థత

గడివేముల : పిడుగుపాటు శబ్దానికి ఇద్దరు అస్వస్థతకు గురైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. గడివేములలో కొర్రపోలుర్‌కు వెళ్లే రహదారి పక్కన పొలంలో గడివేములకి చెందిన దూదేకుల మాసుం వలి, దూదేకుల మాబాష పని చేస్తున్నారు. రెండు కిలోమీటర్ల దూరంలో పిడుగు పడింది. పిడుగు శబ్దానికి వారు సొమ్మసిల్లి పడిపోయారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే పొలం వద్దకు వెళ్లి వారిని 108 అంబులెన్స్‌లో నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు.

గాలివాన బీభత్సం

కొత్తపల్లి : కొత్తపల్లి మండలం సింగరాజు పల్లి గ్రామంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. భారీ వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. సాయంత్ర ఒక్కసారిగా గాలి వాన రావడంతో గ్రామంలో ఉన్న ఆంజనేయస్వామి దేవాలయం పక్కన ఎన్నో సంవత్సరాల నుంచి ఉన్న చెట్టు నేలకొరిగింది. దీంతో అక్కడే ఉన్న విద్యుత్ స్తంభాలు నేలవాలడంతో తీగలు తెగిపోయాయి. విద్యుత్ అంతరాయం ఏర్పడింది. గ్రామంలోని పలు ప్రాంతాల్లో వేప చెట్లు కూడా విరిగి నివాసాలపై పడ్డాయి.

మృతి చెందిన చక్రవర్తి (18)

నేలకొరిగిన భారీ వృక్షం

రూ.18 కోట్లతో తెలుగు గంగ కాలువ పనులు : ఎస్ఇ

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి మండలం గుండా సాగే తెలుగు గంగ ప్రధాన కాలువ, పంటల కాలువల మరమ్మతులను రూ.18 కోట్లతో చేపడుతున్నట్లు తెలుగు గంగ ఎస్ఇ వెంకట రమణయ్య తెలిపారు. గురువారం మండలంలోని చింతల చెరువు, చిన్నవంగలి సమీపంలో జరుగుతున్న తెలుగు గంగ ప్రధాన కాలువ లైనింగ్ పనులు, పంట కాలువల పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు గంగ ప్రధాన కాలువ 35, 26వ బ్లాక్‌ల వద్ద పనులు జరుగుతున్నాయని చెప్పారు. చింతలచెరువు సమీపంలోని పంట కాలువల్లో పూడిక తీత, కాలువ మరమ్మతులు జరుగుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఈఈ శివశంకర్రెడ్డి, డీఈ గోవిందరాజులు, ఏఈలు సలీం, నియాజ్, వినయ్ కుమార్, మోహన కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎస్ఇ

సిఎంకు స్వాగతం పలుకుతున్న మంత్రి బుగ్గన

సిఎంకు ఘనంగా స్వాగతం

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కర్నూలు జిల్లా పర్యటన సందర్భంగా గురువారం ఓర్వకల్ విమానాశ్రయానికి ప్రత్యేక విమానంలో వచ్చారు. ఈ సందర్భంగా సీఎంకు జిల్లా ఇన్చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, హాఫీజ్‌ఖాన్, డాక్టర్ జె. సుధాకర్, ఆర్థర్, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్ రెడ్డి, విశాఖ బాషా రామచంద్ర రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన, నంద్యాల ఎస్‌పి.రఘువీర్‌రెడ్డి, ఎయిర్ పోర్టు డైరెక్టర్ విద్యాసాగర్, కర్నూల్ ఆర్‌డిఒ హరి ప్రసాదులు స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక హెలికాప్టర్‌లో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పత్తికొండకు బయలుదేరి వెళ్లారు. అనంతరం మధ్యాహ్నం 2.15 గంటలకు కర్నూలు జిల్లా పర్యటన ముగించుకొని తిరిగి అమరావతికి బయలుదేరి వెళ్లారు.

చదువుతోపాటు క్రమశిక్షణ అవసరం

ప్రజాశక్తి - ఆళ్ళగడ్డ

విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు, క్రమశిక్షణ ఎంతో అవసరమని ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి అధ్యక్షులు ఆవుల భాస్కర్ రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద విశ్వమానవ సేవ సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాల సంస్కరణ శిక్షణ తరగతులు ముగింపు వేడుకలను ఆవుల పుల్లారెడ్డి సేవాసమితి ఆవరణంలో గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు విశిష్ట అతిథులుగా ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి అధ్యక్షులు ఆవుల భాస్కర్ రెడ్డి, సంస్థ గౌరవ అధ్యక్షురాలు లత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఆవుల భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, క్రమశిక్షణ చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో వివేకానంద సేవ సమితి అధ్యక్షులు శివ ప్రసాద్, శిక్షణ ఉపాధ్యాయులు శ్రీనివాస రెడ్డి సభ్యులు వర్ధనచారి, చిరంజీవి, బ్రహ్మయ్య, ఈశ్వర్, మహమ్మద్ హుస్సేన్, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆవుల విజయభాస్కర్ రెడ్డి

అహోబిలంలో వైభవంగా స్వాతి వేడుకలు

- అహోబిలేసుని సన్నిధిలో యువ హీరో పూరి ఆకాష్

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : మండలంలోని అహోబిలం లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో స్వాతి వేడుకలు గురువారం వైభవంగా జరిగాయి. లక్ష్మీనరసింహస్వామి జన్మనక్షత్రమైన స్వాతి పురస్కరించుకొని అధిక సంఖ్యలో భక్తులు కాలినడకన తరలివచ్చి నల్లమల అరణ్యంలో వెలిసిన నవ నారసింహులను దర్శించుకున్నారు. దిగువ అహోబిలంలో ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించిన అనంతరం స్వామి అమ్మవార్ల ఎదుట సుదర్శన హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, అర్చక బృందం వేద మంత్రోచ్చారణల మధ్య స్వాతి సుదర్శన హోమం నిర్వహించారు.

అహోబిలేశుని సన్నిధిలో యువ హీరో పూరి ఆకాష్ అహోబిలం లక్ష్మీనరసింహస్వామిని డైరెక్టర్ పూరి జగన్నాథ్ కుమారుడు పూరి ఆకాష్ దర్శించుకుని పూజలు చేశారు. పూరి ఆకాష్ ఎగువ, దిగువ, మాలోల వరాహ నరసింహస్వామి వారిని దర్శించుకున్నారు. దిగువలో జరుగుతున్న స్వాతి సుదర్శన హోమంలో పాల్గొన్నారు. ఆకాష్ పూరిని వైసిపి నాయకులు గంగుల సుదర్శన్ రెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డిలు కలిసి ముచ్చటించారు. **బనగానపల్లె :** పట్టణంలోని రవ్వల కొండమీద ఉన్న చెంచులక్ష్మి సమేత పావన నరసింహ స్వామి దేవస్థానంలో స్వాతి నక్షత్ర వేడుకలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకులు నరసింహమూర్తి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

యువ హీరో పూరి ఆకాష్‌తో వైసిపి నాయకులు

ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోండి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : వ్యర్థ పదార్థాలను తగ్గించుకొని ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. పర్యావరణ హిత జీవనశైలి మాసోత్సవంలో భాగంగా నూతల సెక్షన్ ఫారెస్ట్ బీట్ అధికారి రామకృష్ణ, చెలిమ కూప్ ఫారెస్టర్ రాణమ్మ, ప్రొటెక్షన్ వాచర్ సుధాకర్‌లు కలిసి ఆళ్లగడ్డ మండలం గూబగుండం గ్రామ ప్రజల సమక్షంలో పర్యావరణ హిత జీవనశైలిలో భాగంగా వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. **రుద్రవరం :** భవిష్యత్ తరానికి పర్యావరణ శక్తిపై అవగాహన కల్పించడంలో ఎనర్జీ క్లబ్‌లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వరరావు తెలిపారు. లైఫ్ మిషన్ ఆధ్వర్యంలో ఎనర్జీ క్లబ్ భాగంగా ప్రిన్సిపాల్ అధ్యక్షతన ఎనర్జీ క్లబ్, పిఇటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎనర్జీ ప్లెడ్జ్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు.

ఉప్పలపాడులో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - అవుకు : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో పశు వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. పశు వైద్యురాలు డాక్టర్ భారతీదేవి, వైయస్సార్ పశు సంచార వాహన డాక్టర్ తస్లీమా నజరీన్‌లు పాడి పశువులను పరీక్షించి తగిన చికిత్సలను అందించారు. గ్రామాల్లోని రైతులు తమ పశువులకు ఏ విధమైన జబ్బు కలిగినా తమకు వెంటనే సమాచారం అందిస్తే వైద్యాన్ని అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి - పాణ్యం : రజకులను ఎస్‌సి జాబితాలో చేర్చాలని రజక సంఘం మండల అధ్యక్షుడు తిరుపాలు కోరారు. గురువారం పాణ్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాణ్యంలో దాదాపు 100 రజక కుటుంబాలు కుల వృత్తిపై ఆధార పడి జీవిస్తున్నారని, వారందరికీ దోభిఘాట్లు నిర్మించాలని, వృత్తిదారులకు సమావేశ మందిరం నిర్మించాలని కోరారు. ఇప్పటికీ రజక కులస్తుల మీద దాడులు జరుగుతున్నాయని, ఇలాంటి సంఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు మద్దిలేటి, చిన్న మద్దిలేటి, యల్ల సుబ్బయ్య, చిన్న బుద్దన్న, నాగరాజు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టు

- రాకపోకలకు అంతరాయం

ప్రజాశక్తి - రుద్రవరం : తమ స్వార్థం కోసం పచ్చని చెట్లకు నిప్పు పెట్టి కాల్చి వేస్తున్నారు. అగ్నికి ఆహుతైన చెట్లు రోడ్డుకు అడ్డంగా విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వివరాలు.. రెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఓ రైతు తమ పంట పొలంలో చెట్ల కారణంగా పంట దిగుబడి తక్కువగా వస్తుందన్న కారణంగా సమీపంలో ఉన్న పచ్చని చెట్లకు నిప్పు పెట్టి వాటిని కూల్చివేస్తున్నాడు. గత రెండు రోజుల క్రితం నరసాపురం సమీపంలో చెట్లకు నిప్పు పెట్టి పూర్తిగా కూల్చివేశారు. ఆ సంఘటన మరువకముందే రెడ్డిపల్లె సమీపంలో చెట్లను నిప్పు పెట్టి కూల్చివేస్తూ ఉండడంతో పచ్చదనం పూర్తిగా లేకుండా పోతుంది. రోడ్డుకు అడ్డంగా విరిగిపడిన చెట్టును ఎవరు తొలగించకపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అధికారులు స్పందించి వెంటనే రోడ్డుకు అడ్డంగా పడిన చెట్టును తొలగించాలని, చెట్లకు నిప్పు పెట్టకుండా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కించపరిచే ఫ్లెక్సీలను తొలగించండి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : జనసేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌ను కించపరిచే ఫ్లెక్సీలను వెంటనే తొలగించాలని నాయకులు పత్తి సురేష్ బాబు, జిల్లా కార్యక్రమాల నిర్వహణ కమిటీ సభ్యులు చిన్న బాబు, గురప్ప, నాగ ప్రసాద్, కిట్టు, విజయ్ ఆధ్వర్యంలో ఆందోళన గురువారం చేపట్టారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ కార్యాలయంలో జనసేన ఆధ్వర్యంలో ఎస్సై వెంకటరెడ్డికి వినతి పత్రం అందజేశారు. పేరూరు గురప్ప, నాగేశ్వరరావు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సజ్జలను కలిసిన చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు : దివంగత ఎమ్మెల్సీ చల్లా రామకృష్ణారెడ్డి తనయుడు, వైసిపి నాయకులు చల్లా విగ్నేశ్వర్ రెడ్డి గురువారం తాడేపల్లిలో ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తమ కుటుంబ సభ్యులైన చల్లా రాజశేఖర్ రెడ్డి, చల్లా విజయభాస్కర్ రెడ్డి, చల్లా రఘునాథరెడ్డి, దుగ్గిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డిలతో కలిసి మొదట ప్రభుత్వ సలహాదారులైన చల్లా సుదర్శన్ రెడ్డిని, సజ్జల రామకృష్ణారెడ్డిని విడివిడిగా కలిసి అవుకు మండల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు.

మహానందిలో నలుగురు ఉద్యోగులు బదిలీ

ప్రజాశక్తి - మహానంది : మహానంది పుణ్యక్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు ఉద్యోగులు దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆదేశాల మేరకు బదిలీ అయ్యారని ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ సీనియర్ అసిస్టెంట్ నీలకంఠరాజు, జూనియర్ అసిస్టెంట్ నాగ మల్లయ్యలు కసాపురంచ గుంతగల్లుకు, సీనియర్ అసిస్టెంట్ శశిధర్ రెడ్డి శ్రీకాళహస్తికి, ఎలక్ట్రిషన్ చిన్న వెంకటేశ్వర్లు శ్రీశైలం దేవస్థానానికి బదిలీ అయ్యారని చెప్పారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పట్టణంలోని స్థానిక వైపిపియం పాఠశాలలో శాఖ గ్రంథాలయ అధికారిణి అరుణా కుమారి ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులకు ఆటల పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలకు విద్యార్థులు ముందుకు వస్తున్నారన్నారు. తమకు ప్రోత్సాహం అందిస్తున్న వైపిపిఎం పాఠశాల హెచ్‌ఎం వెంకటరామిరెడ్డికి, ఖాజా మొహినుద్దిన్‌కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థిని, విద్యార్థులతో గ్రంథాలయ అధికారిణి

ఆర్థిక సాయం చేస్తున్న పల్లె నరసింహా రెడ్డి సతీమణి

ఎంబిబిఎస్ విద్యార్థికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - కోవెలకుంట్ల : కోవెలకుంట్ల పట్టణానికి చెందిన ఎంబిబిఎస్ విద్యార్థి త్యాగరాజు దత్తకు ప్రకృతి పీఠం వ్యవస్థాపకులు పల్లె నరసింహారెడ్డి ఆయన సతీమణితో కలిసి రూ. 10 వేలు ఆర్థికసాయం చేశారు. గురువారం అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం సందర్భంగా ఆయన తల్లిదండ్రుల జ్ఞాప కార్థంగా, పుట్టినరోజు సందర్భంగా పట్టణానికి చెందిన సురేంద్ర, సరస్వతిల కుమారుడు త్యాగరాజు దత్త ఇటీవల ఎంబిబిఎస్‌లో సీటు సాధించి తిరుపతిలో చదువుతుండగా విద్యార్థికి ఆర్థిక సాయం అందజేశారు.

జమాతె ఇస్లామి అధ్యక్షుడికి సన్మానం

ప్రజాశక్తి - నంద్యాల : జమాఅతె ఇస్లామి హింద్ నంద్యాల శాఖ అధ్యక్షులుగా రెండవసారి (2023-25) ఎన్నికైన షేక్ అబ్దుల్ సమద్‌ను జమైతుల్ ఉలేమా యే హింద్ రాష్ట్ర కన్వీనర్ మౌలానా ఖలీల్ అహ్మద్ సంఘవి, మౌలానా మహబూబ్ బాషా రాషాది, మౌలానా రహంతుల్లా తదితరులు గురువారం స్థానిక జమాఆతె ఇస్లామి కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మౌలానా ఖలీల్, మహబూబ్ బాషా మాట్లాడుతూ హాజీ అబ్దుల్ సమద్ జమాత్ అధ్యక్షులుగా సేవలు అందిస్తూ నంద్యాలలో ఎన్నో సమస్యలను తనదైనశైలిలో పరిష్కారం కోసం ప్రయత్నించారని అన్నారు. ఉర్దూ హెడ్మాస్టర్ నౌమన్, హాఫీజ్ అన్వర్, హాఫీజ్ మదస్సిర్, పలువురు ఉలేమాలు పాల్గొన్నారు.

కిందపడి హెడ్ కానిస్టేబుల్ మృతి

ప్రజాశక్తి - రుద్రవరం : బస్సు ఎక్కడానికి వెళ్తూ ప్రమాదవశాత్తు కిందపడిన హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ (46) మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రుద్రవరం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్ విధులు ముగించుకొని నంద్యాలలోని తన నివాసానికి వెళ్తుండగా సిరివెళ్ల మెట్ట దగ్గర బస్సు ఎక్కేందుకు పరిగెత్తారు. ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్రంగా గాయపడ్డా రు. ఆయనను చికిత్స నిమిత్తం నంద్యాలలోని ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. హెడ్ కానిస్టేబుల్ మృతి పట్ల పలువురు అధికారులు, నాయకులు, ప్రజలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్

గుండెపోటుతో ఉపాధి కూలీ మృతి

ప్రజాశక్తి - కొత్తపల్లి

మండలంలోని శివపురం గ్రామానికి చెందిన ఉపాధి కూలీ గుండెపోటుతో మృతి చెందాడు. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు శివపురం గ్రామానికి చెందిన బత్తుల పుల్లయ్య గౌడ్(45) గురువారం ఉపాధి పనులకు వెళ్లాడు. ఫీడర్ ఛానల్ పనిచేస్తుండగా పని ప్రదేశంలో గుండె నొప్పి రావడంతో అక్కడే ఉన్న మేటీ, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు తెలిపాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం వెళుతుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10 లక్షలు ఆర్థిక సాయం చేయాలి

గుండెపోటుతో మృతి చెందిన ఉపాధి హామీ కూలీ పుల్లయ్య కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. నీడ, నీరు, మెడికల్ కిట్లు అందుబాటులో లేవన్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

పెసల సుంకన్న (ఫైల్)

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో జిసి పాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పెసల సుంకన్న (50) గురువారం ఉదయం బ్రెయిన్ స్ట్రోక్‌తో మరణించినట్లు ఎంపీడీవో వస్తే ఏపీవో వసుధ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. గురువారం ఉదయం ఇంట్లో ఉన్న సుంకన్న బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో భార్య, అతని కుమారుడు నంద్యాల క్రిటికల్ కేర్‌కు తీసుకువెళ్లగా అక్కడ పరిస్థితిని గమనించిన డాక్టర్లు కర్నూలుకు తీసుకుపో మని సలహా ఇవ్వగా కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రిలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సుంకన్న మృతదేహానికి ఎంపీడీవో వాసుదేవ గుప్త, ఏపీవో వసుధ, సిపిఎం మండల కార్యదర్శి రత్నమయ్య, సుంకన్న నివాళు లర్పించారు.

మరుగుజ్జు మహిళకు వైద్య సేవలు అందించిన డాక్టర్లు

మరుగుజ్జు మహిళకి పండంటి ఆడబిడ్డ

- సురక్షితంగా కాన్పు చేసిన జోహా హాస్పిటల్ వైద్య బృందం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని స్థానిక జోహా హాస్పిటల్ నందు ఆత్మకూరు మండల పరిధిలో పెద్దనంతపురం గ్రామానికి చెందిన మొండి గోవర్ధని మూడు అడుగుల మరుగుజ్జు మహిళా పండంటి ఆడబిడ్డకు గురువారం ఉదయం జన్మనిచ్చింది. జోహా హాస్పిటల్ గైనకాలజిస్ట్ డాక్టర్ జరీనా తాజ్, అనస్తీసియా డాక్టర్ సలాం, పీడియాట్రిక్ డాక్టర్ వినోద్, డాక్టర్ మన్సూర్ భాష ఆధ్వర్యంలో పెద్దనంతపురం గ్రామానికి చెందిన మూడు అడుగుల మరుగుజ్జు మహిళ మొండి గోవర్ధని డాక్టర్ల పర్యవేక్షణలో సిజేరియన్ ద్వారా 1.8 కేజీల శిశువుకు జన్మనిచ్చింది. తల్లి గోవర్ధిని, శిశువు హాస్పటల్లో క్షేమంగా ఉన్నారు. మరుగుజ్జు మహిళా అతి క్లిష్టమైన పరిస్థితిలో ఆడబిడ్డకు జన్మనివ్వడం ఆనందంగా ఉందన్నారు. గోవర్ధని మాట్లాడుతూ 'నాకు సురక్షిత డెలివరీ చేయాలని ఆత్మకూరు పట్టణంలో ఎన్నో హాస్పిటల్లో వెళ్లానని, నేను మరుగుజ్జుగా ఉండటంతో ప్రమాదవశాత్తు ఏదైనా జరిగితే కష్టమని అనేక మంది డాక్టర్లు నన్ను హాస్పిటల్లో అడ్మిట్ చేసుకోలేదు. అత్యవసరంగా కాన్పు నొప్పులు వస్తుండటంతో జోహా హాస్పిటల్‌ను ఆశ్రయించాను. వెంటనే జోహా హాస్పిటల్ డాక్టర్లు స్పందించి సిజేరియన్‌తో సురక్షితమైన కాన్పు చేశారు. డాక్టర్ల బృందం కృషితో సురక్షితంగా కాన్పు చేశారు. నన్ను, నా బిడ్డను క్షేమంగా కాపాడిన జోహా హాస్పిటల్ డాక్టర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు'. జోహా హాస్పిటల్ మేనేజర్ ఫిరోజ్ బాష గోవర్ధనికి బ్రెడ్లను పంపిణీ చేశారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సాయం వచ్చేటట్లు కృషి చేస్తానని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - మహానంది

మండలంలో గోపవరం గ్రామం పెట్రోల్ బంకు సమీపంలో గురువారం నాడు రెండు బైకులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈఘటనలో ఓ యువకుడు మృతి చెందగా, మరోకరి పరిస్థితి విషంగా, ఇద్దరికి గాయాలు అయ్యాయి. వివరాల మేరకు.. మండలంలోని నందిపల్లి గ్రామానికి చెందిన సద్దల నటరాజ్ మహానందిలో దర్శించుకొని బైక్‌పై నంద్యాలకు వస్తుండగా.. మరొక బైక్‌పై ముగ్గురు వ్యక్తులు నంద్యాల నుండి మహానంది వైపు వస్తుండగా గోపవరం గ్రామం పెట్రోల్ బంకు సమీపంలో రెండు ఢీకొన్నాయి. ఈ ఘటనలో నందిపల్లి గ్రామానికి చెందిన సద్దల నటరాజ్ (18) అక్కడికక్కడే మృతి చెందాడు. మరొకరు ఆర్ఎస్ గాజులపల్లి గ్రామానికి చెందిన శంకర్ గౌడ్ (40) పరిస్థితి విషమంగా ఉంది. వీరిని స్థానికులు చికిత్స నిమిత్తమై నంద్యాల హాస్పిటల్‌కు తరలించారు. మరో ఇద్దరికీ గాయాలు అయినట్లు మహానంది పోలీసులు తెలిపారు. మహానంది ఎస్సై నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

ప్లాస్టిక్ వాడకాన్ని నిషేదించాలి

ప్రజాశక్తి-డోన్

దేశంలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని 9వ ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సిసి యూనిట్ తరుపున సాయిశ్రీ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ ఎన్.మహేంద్రగౌడ్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించి పర్యావరణాన్ని కాపాడాలని, అదేవిధంగా ప్లాస్టిక్ వలన కలిగే దుష్పరిణామాలను గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి బెటాలియన్ నుంచి నాయబ్‌సుబేదార్, శంతన్‌సింగ్, సుబేదార్,వినోద్ పాల్గొన్నారు. సాయిశ్రీ ఎన్‌సిసి విద్యార్థులు శారద, నాయుడు, నాగప్ప, సోమశేఖర్, సుబేదార్లు ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వాడితే కలిగే నష్టాల గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రదర్శన నిర్వహిస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

బిజెపి ఎంపీని అరెస్టు చేయాలి

(5వ పేజీ తరువాయి..) సభ్యులు ఎం నాగేశ్వరావు, బిఎస్‌పి నియోజకవర్గ అసెంబ్లీ ఇన్చార్జి ఎల్. స్వాములు, సిఐటియు జిల్లా నాయకులు కే భాస్కర్ రెడ్డి, గోపాలకృష్ణ మాట్లాడారు. సిపిఎం, ప్రజా సంఘాల నాయకులు ఆంజనేయులు, ఆర్ జయరాణి, కే వెంకటేశ్వర్లు, నాగన్న, బి శ్రీనివాసులు, ఎల్లా నాగన్న రామచంద్రుడు, కేశవ్ గౌడ్, రాజు, నారాయణ, ఎస్ఎఫ్ఐ నాయకులు హరి వర్ధన్, శేషాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు. **పాములపాడు:** బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు సోమన్న, రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర రావు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్సార్ రమణ, బాల యేసు సిఐటియు నాయకులు సి హనుమంతు, మైనార్టీ సంఘం నాయకులు షర్ఫుద్దీన్ అలీ, ఉస్మాన్ బాష, మక్బూల్ బాష, బీసీ సంఘం నాయకులు, మద్దిలేటి, బాలకృష్ణ, ఆనంద్ గౌడ్, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బిజెపి ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. **వెలుగోడు :** వెలుగోడులో కెవిపిఎస్, సిఐటియు ఆధ్వర్యంలో బిజెపి ఎంపీ బ్రిజ్ భూషణ్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రామదాసు మాట్లాడారు. కార్యక్రమంలో కెవిపిఎస్, సిఐటియు నాయకులు ఎర్ర బాష, రామకృష్ణ, కృష్ణ, నూరుల్లా, సుబ్బయ్య, పకీరయ్య, భాస్కర్, ఆంజనేయులు, సుధాకర్, ఇస్మాయిల్, ఖాదర్ బాషా, వెంకట య్య, శివరాం, ముజాఫ్, కేశాలు తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో ..

పాములపాడులో..

వెలుగోడులో..

జియో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి : సిపిఎం

వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - నందికొట్కూరు

నందికొట్కూరులోని ఐదో వార్డ్ పరిధిలో సత్యనారాయణ టెంపుల్ మధ్యలో నిర్మిస్తున్న జియో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కాలనీ వాసులతో కలిసి సిపిఎం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ పి కిషోర్, తహశీల్దార్ రాజశేఖర్ బాబులకు జై కిసాన్ పార్కులో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సభ్యుడు ఎం నాగేశ్వరరావు, సిపిఎం నాయకులు పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పట్టణంలో పేదలు నివసించే చోట సెల్ టవర్ బిగించడం వలన రేడియేషన్ వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు వస్తాయని అన్నారు. గతంలో సెల్ టవర్లతో అనేక చోట్ల అనేక వ్యాధులు వచ్చి చనిపోవడం జరిగిందన్నారు. తక్షణమే టవర్ నిర్మాణాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ కిషోర్ మాట్లాడుతూ తక్షణమే రద్దు చేస్తామని ఎలాంటి అనుమతులు మంజూరు చేయలేదని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకుడు కే భాస్కర్ రెడ్డి, టౌన్ కార్యదర్శి గోపాలకృష్ణ, సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు వి ఆంజనేయులు, సి నాగన్న, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ కల్పించాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల

లారీ, ట్రాక్టర్, ట్రాలీ ఆటో, కార్మికులందరికీ పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ కమిటీ నాయకులు వైబి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయినా సందర్భంగా బేతంచెర్ల లారీ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ దగ్గర లారీ యూనియన్ ఆఫీస్ ముందు కమిటీ సభ్యులు ఎస్ ఖాజా ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా బేతంచర్ల లారీ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి వైబి వెంకటేశ్వర్లు, లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వై ఎల్లయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రాన్స్‌ఫోర్ట్ కార్మికుల పట్ల నిరంకుశ వైఖరిని అవలంబిస్తున్నాయని అన్నారు. బిజెపి ప్రభుత్వం కొత్తకొత్త జీవోలతో రవాణా రంగాన్ని కుదేలు చేస్తోందన్నారు. డ్రైవర్లకు ఉరితాడు లాంటి జీవో నెంబర్ 21ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వాహన డ్రైవర్లకు ఈఎస్ఐ, పిఎఫ్, 60 సంవత్సరం నిండిన వాహన డ్రైవర్ల అందరికీ పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. హైవేలపై రెస్ట్ రూములో నీటి వసతి కల్పించాలని, ప్రతి వంద కిలోమీటర్లకి ఈఎస్ఐ సౌకర్యం కలిగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్లు స్వామి నాయుడు, శ్రీనివాసులు, మాలిక్ బాషా, మహేశ్వర్ రెడ్డి, మల్లయ్య, ఆంధ్ర భోజనం మద్దిలేటి, రాముడు, కుల్లాయప్ప, మధు, ఆశిన్ బాష, రామచంద్రుడు, గద్ద గఫార్, కోయిలకుంట్ల బాష, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సుబ్బారెడ్డితో కేక్ కట్ చేయించి పూల మాలలు వేసి సన్మానిస్తున్న కమలాపురం రమేష్

ప్యాపిలి : కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు తెలిపిన టిడిపి శ్రేణులు

ధర్మవరం సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-డోన్

టిడిపి డోన్ నియోజకవర్గం ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలు గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. టిడిపి ఇంచార్జ్ సుబ్బారెడ్డి నివాసంలో పార్టీ నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి సుబ్బారెడ్డిని శాలువలతో సన్మానించి, కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ధర్మవరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ నియోజ కవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు చూపిస్తున్న అభిమానానికి రుణపడి ఉంటాను అన్నారు. చంద్రబాబు ప్రకటించిన టిడిపి మేనిఫెస్టోతో వైసీపీ పతనం ఖాయమైందని అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. **ప్యాపిలి :** స్థానిక టీడీపీ కార్యాలయంలో డోన్ టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి ధర్మవరం సుబ్బారెడ్డి పుట్టినరోజు వేడుకలు టిడిపి కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. తమ నియోజకవర్గ అభ్యర్థి సుబ్బారెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని, రాబోవు ఎన్నికలలో గెలిచి ఎమ్మెల్యే కావాలని వెంకటేష వరరెడ్డి, సుంకయ్య, రాంమోహన్ యాదవ్ అన్నారు. కేక్ కట్ చేసి స్వీట్స్ కార్యకర్తలకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి, పెద్ద రామాంజి నేయలు, ఖాజా పీర్,కె మధు,సుధాకర్ గుప్త,మధు, ధనం మధు, శీను,గోపాల్ రెడ్డి,మౌలాలి రెడ్డి పాల్గొన్నారు.

8 నుండి నంద్యాలలో రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

ప్రజాశక్తి - నంద్యాల

ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నంద్యాల జిల్లా సంఘం నిర్వహణలో ఈనెల 8వ తేదీ నుండి 11వ తేదీ వరకు నాలుగు రోజులపాటు నంద్యాలలోని రామకృష్ణ పిజి కళాశాల ఆవరణలో రాష్ట్రస్థాయి 19 సంవత్సరాల లోపు ఫిడే ర్యాంకింగ్ ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు జరగనున్నాయని జిల్లా చెస్ సంఘం చైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ తెలిపారు. గురువారం రామకష్ణ డిగ్రీ కళాశాలలో పాత్రికేయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నంద్యాల జిల్లా చెస్ సంఘం ఏర్పడిన తర్వాత మొదటిసారిగా రాష్ట్ర స్థాయి చెస్ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో కర్నూలు జిల్లాలో భాగంగా ఉన్న నంద్యాల చెస్ సంఘం అనేక రాష్ట్రస్థాయి పోటీలు నంద్యాలలో నిర్వహించామని గుర్తు చేశారు. ఇప్పుడు నిర్వహిస్తున్న టోర్నమెంట్లో రూ.50 వేల నగదు బహుమతు లతో పాటు విజేతలకు ట్రోఫీలు, పతకాలు, ప్రశంసా పత్రాలు అందిస్తామని, రాష్ట్రం నలుమూలల నుండి పోటీల్లో క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. నివాస వసతి రామకృష్ణ పి.జీ మహిళా హాస్టల్, శాంతినికేతన్ పాఠశాల, భువన విజయం కళాశాలలో ఏర్పాటు చేశామని చెప్పారు. విజేతలకు అందించే పతకాలు లయన్స్ క్లబ్, ట్రోఫీలు రోటరీ క్లబ్ సౌజన్యంతో ఇస్తున్నామని తెలిపారు. పేర్లు నమోదు చేసుకోవడానికి 5వ తేదీ వరకు పొడిగించడం జరిగిందని చెప్పారు. పోటీల వివరాలతో రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. వివరాల కోసం 9010451585 సంప్రదించాలని కోరారు.

గ్రంథాలయాలతో ఉన్నత స్థానాలకు..

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

విద్యార్థులు గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నతమైన స్థానాలకు ఎదిగారని కర్నూలు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ పేర్కొన్నారు. సమ్మర్ క్యాంపులో భాగంగా గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ కోయి లకుంట్ల గ్రంథాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. కేవలం పాఠ్యపుస్తకాలు చదువుతూ నే కాదు గ్రంథాలయంలో ఉన్న విజ్ఞాన పుస్తకాలు చదివితేనే విజ్ఞానము పెరుగుతుందన్నారు. ఎంతోమంది జాతీయ నాయకులు గ్రంథాలయమును ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు చేరుకున్నారన్నారు. కృషి, పట్టుదలతో శ్రద్ధగా శ్రమిస్తే అనుకున్నది తప్పక సాధిస్తారన్నారు. ఈ సమ్మర్ క్యాంపులో గ్రంథాలయ అధికారి నిర్వహిస్తున్న తీరును ప్రశంసించారు. అనంతరం ఆయన గ్రంథాలయం రికార్డులను తనిఖీ చేసి పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. **పగిడ్యాల:** చరిత్రకు సాక్షాధారాలు గ్రంథాలయాలని గ్రంథాలయ అధికారిని కే మద్దమ్మ అన్నారు. గురువారం పగిడ్యాల గ్రంథాలయంలో గ్రంథాలయ వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని మద్దమ్మ మాట్లాడారు. చరిత్రకు ఎన్నో సాక్షాధారాలు గ్రంథాలయాలలో నిక్షిప్తమై ఉన్నాయన్నారు. అనంతరం లెక్కల ఉపాధ్యాయుడు అశోక్ బాబు విద్యార్థులచే లెక్కలు చేయించి చదివించడం జరిగిందన్నారు. విద్యార్థులకు మజ్జిగ, చాక్లెట్లు పంపిణీ చేశారు. మోడల్ స్కూల్, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి - ఆత్మకూరు

క్షయ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని డాక్టర్ పవన్ కుమార్ అన్నారు. గురువారం నాడు మండల పరిధిలోని బాపనంతపురం గ్రామంలో టిబి ముక్తా పంచాయతీ కార్యక్రమం సచివాలయంలో గ్రామ సర్పంచ్ దర్గయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పవన్ కుమార్, టిబి యూనిట్ సీనియర్ ట్రీట్మెంట్ సూపర్వైజర్ కేపీ మస్తానయ్యలు టిబి పై ప్రజలకు వివరించారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించండి

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని పెద్దవంగలి గ్రామానికి నుడా కింద 139 గృహాలు మంజూరయ్యాయని వెంటనే లబ్ధిదారులు ఇళ్ళ నిర్మాణాలు ప్రారంభించాలని హౌసింగ్ ఏఈ షఫివుల్లా సూచించారు. గురువారం పెద్దవంగలి గ్రామ సచివాలయ ఆవరణంలో సర్పంచ్ బంగారు షరీఫ్ అధ్యక్షతన లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఏఈ మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్ళ నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఉచితంగా 4 ట్రాకర్ల ఇసుక, రూ.1.80 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బిల్లుల చెల్లింపులలో ఎలాంటి అలస్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, ఇంజనీరింగు సహాయకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పులి జాడపై ఆందోళ వద్దు

ప్రజాశక్తి - కొత్తపల్లి

పులి జాడ కోసం రెండోరోజు గురువారం గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందని, పులి కాదు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ముసలమడుగు ఫారెస్ట్ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. వారు మాట్లాడుతూ సమాచారం మేరకు పులి కాదు కుక్క అయి ఉంటుందని మాకు అనుమానం ఉన్నట్లు తెలిపారు. ఏది ఏమైనాప్పటికీ పలు గ్రామాల ప్రజలు ఎవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - పగిడ్యాల

పగిడ్యాల మండలానికి నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ శుక్రవారం రానున్నట్లు ఎంపీడీవో వెంకటరమణ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మండలంలోని లక్ష్మాపురం సచివా లయం 2 పరిధిలో గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారని ఆయన తెలిపారు.

సిఎం జగన్‌తో సెల్ఫీ దిగుతున్న జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

సిఎంని కలిసిన జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - అవుకు

కర్నూలు జిల్లా పత్తికొండ పట్టణానికి వచ్చిన ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని జడ్పిటిసి చల్లా శ్రీలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. అవుకు మండల సమస్యలపై ముఖ్యమంత్రి జగన్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు జడ్పిటిసి చల్లా శ్రీ లక్ష్మీ తెలిపారు. అనంతరం ఇద్దరు కుమారులైన చల్లా రాజ్యాభిషేక రెడ్డి, జూనియర్ చల్లా రామకృష్ణారెడ్డి తో కలిసి సిఎంతో జడ్పిటిసి సెల్ఫీ దిగారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత రైతు భరోసా ఇది ఐదో విడత విడుదల చేయటం రైతులకు గొప్ప వరమని అన్నారు. ఈ కార్యక్రమంలో చల్లా విక్రాంత్ రెడ్డి, చల్లా చరణ్ రెడ్డి,చల్ల సాయి చైతన్య రెడ్డి పాల్గొన్నారు.

అంగన్వాడి ఆయా పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని మూడు అంగన్వాడీ ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయని అర్హులైన మహిళలు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ ప్రాజెక్టు ఇన్చార్జి అధికారి సూర్య కుమారి గురువారం తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని 17వ అంగడి కేంద్రంలో ఆయా పోస్టును బీసీ డీకి రిజర్వేషన్ చేయడం జరిగిందన్నారు. బండి ఆత్మకూరు మండలం పరిధిలోని బోధన కేంద్రంలో ఆయా పోస్టులు బీసీ బీకి, మహనంది మండలం పరిధిలోని మసీదు పురం ఒకటవ కేంద్రంలోని ఆయా పోస్టులను ఈడబ్ల్యూఎస్‌కు రిజర్వేషన్ చేయడం జరిగిందన్నారు. పూర్తి సమాచారాన్ని స్థానిక సూపర్వైజర్లు లేదా ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలోనూ తెలుసుకోవచ్చని ఆమె సూచించారు.

చిన్న వెంకటస్వామికి పలువురు శుభకాంక్షలు

ప్రజాశక్తి - నందికొట్కూరు

టిడిపి అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి పుట్టినరోజు వేడుకలను నందికొట్కూరు పట్టణంలోని స్థానిక టిడిపి కార్యాలయం నందు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు, కార్యకర్తలు, కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్చార్జ్ జయకర్, నిమ్మకాయల రాజు, వేణుగోపాల్,అశోక్, బొల్లెద్దులరాజన్న,ప్రవీణ్ రగడ,సురేష్, వంశీ, శ్రీకాంత్, శ్రీనివాసులు, తదితర నాయకులు పాల్గొన్నారు.

IN THE COURT OF SENIOR CIVIL JUDGE : DHONE.
I.P. No. 10/2023

RAGINI PEDDA NALLAMMA,
Age : 52 Years, W/o. Late R. Sankar, Hindu, Housewife, R/o. H.No.4-149-133, Teachers Colony, Dhone Town and Mandal, Nandyal Dist.
Cell : 95052 65526, 81253 16005.
... PETITIONER/DEBTOR

Vs.

1.M. NALLA REDDY, Age: 60 years, S/o.M. Nallappa, Hindu, Business, R/O.H.No.3/1050, 3rd Ward, G.V.P. Colony, Behind RTC Bus Stand, Near Chimbili Ramana Water plant, Tadipatri, Anantapur Dist. PIN-515411, Cell:9963963678.
2. M. RENUKA, Age: 50 years, W/o.M. Nalla Reddy, R/o.D.No.3/1050, 3rd Ward, GVP Colony, Tadipatri, Cell:9963963678.
3. J. PADMA, Age: 50 years, W/o.J. Ramesh Babu, R/o.D.No.5/424, Vankagadda Street, Gooty R.S., Anantapur Dist., PIN 515 402, Cell:99850 99012.
4. SHAIK HASEENA, Age:40 years, W/o.Shaik Ismail, R/o.H.No.3-21, ROF Makann Darga Road, Yerukullappa Sandu, Gooty R.S., Anantapur Dist., PIN 515 402, Cell:93819 42499.
5. SHAIK AASHA, Age: 50 years, R/o.H.No.3-21, ROF Makann Darga Road, Yerukullappa Sandu, Gooty R.S., Anantapur Dist., PIN 515 402, Cell : 93819 42499.
6. KORRI ANJINEYULU, Age:65 years, R/o.H.No.1-25, Chetnepalli (V), Gooty R.S., Anantapur Dist., PIN - 515 402.
... RESPONDENTS/CREDITORS

నంద్యాల జిల్లా డోన్ టౌన్ మరియు మండల ప్రజలకు తెలియజేయడము ఏమనగా పై నెంబర్ ఐ.పి.లో అర్జీదారు RAGINI PEDDA NALLAMMA W/o. Late R. Sankar డోన్ టౌన్ మరియు మండలము, నంద్యాల జిల్లా. చీరల వ్యాపారముపై వచ్చిన నష్టములవలన తనను దివాళా దారునిగా తీర్మానము చేయమని కోరుతూ పై కోర్టులో అర్జీదాఖలు (ఐ.పి. పిటిషన్) చేసినారు ఇందుపైన ఎవరికైనా ఆక్షేపణలు వున్న ఎడల 23-06-2023వ తేది పగలు 10:30 గంటలకు పై కోర్టులో హాజరై తెలుపుకొనవలెను. లేని ఎడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : తేది 23-06-2023

M. Nagabushana Reddy, M.A. LLB
Ala Sreedhar, B.Sc., LLB
V. Ravi Prakash, B.A., LLB
S. Heena Begum, B.Com., (Comp) LLB
అర్జీదారుపరం న్యాయవాదులు
Dhone-518222. Nandyal (Dist)
A.P. Cell : 9440294133

Before the Honourable Deputy Registrar of Chits
By Arbitrater : Kurnool.
Dispute No:154/2022

Between :
M/s Sri Balaji Nandi Chits (P) Ltd, Nandyal.
…Disputant

Versus

1) V.Jagadish
2) V.Guruvaiah. ...Opponents

Opponents 1 and 2 Notices

1) V.Jagadish S/o V. Guruvaiah H.No.20-85, Gudipati Gadda, Nandyal.
2) V.Guruvaiah S/o V.Venkata Swamy, H.No.20-85, Gudipati Gadda, Nandyal.

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు వారికి రావలసిన బాకీ మొత్తం 19,631/- అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టు కొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 మరియు 2 అపోనెంట్స్ అయిన మీరు 17.06.2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపు కొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యందరములు లేదని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజే యడమైనది.

వాయిదా తేది : 17.06.2023

By order of the Deputy Registrar of chits
By Arbitrater, Kurnool.

Before the Honourable Deputy Registrar of Chits
By Arbitrater : Kurnool.
Dispute No:156/2022

Between :
M/s Sri Balaji Nandi Chits (P) Ltd, Nandyal.
…Disputant

Versus

1) V.Pullaiah
2) P.Sudhkar Reddy ...Opponents

Opponents 1 and 2 Notices

1) V.Pullaiah S/o V.Sreenivasulu, H.No.7-144, Bandi Atmakur (M), Nandyal Dist.
2) P.Sudhakar Reddy S/o P.Eswar Reddy, Veterinary Assistant Surgeon, Veterinary Dispensary, Mothukur (V), Velgodu (M), Nandyal. (Dist)

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు వారికి రావలసిన బాకీ మొత్తం 1,44,483/- అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టు కొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 మరియు 2 అపోనెంట్స్ అయిన మీరు 17.06.2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపు కొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యందరములు లేదని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజే యడమైనది.

వాయిదా తేది : 17.06.2023

By order of the Deputy Registrar of chits
By Arbitrater, Kurnool.

Before the Honourable Deputy Registrar of Chits
By Arbitrater : Kurnool.
Dispute No:159/2022

Between :
M/s Sri Balaji Nandi Chits (P) Ltd, Nandyal.
…Disputant

Versus

1) S.Keshava Rao
2) U.Sudhakar
3) M.Sreenivasulu. ...Opponents

Opponents 1 To 3 Notices

1) S.Keshava Rao S/o S.Veeraiah, Sub-Engineer O/o. Executive Engineer, A.P.S.P.D.C.L. Noonepalli Road, Nandyal. R/o. H.No.28-851-A4-1, Viswa Nagar, Nandyal.
2) U.Sudhakar S/o U.Balaiah, Lien Man, Nandyal. Division, A.P.S.P.D.C.L. R/o H.No.28-844-U-13, Viswa Nagar, Nandyal.
3) M.Sreenivasulu S/o M.Anjaneyulu, Junior Asst, O/o Executive Engineer, Nandyal. Division, A.P.S.P.D.C.L., Noonepalli Road, Nandyla R/o. H.No. 30-179-A, Gopal Nagar, Nandyal.

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు వారికి రావలసిన బాకీ మొత్తం 5,26,650/- అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టు కొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుంచి 3 అపోనెంట్స్ అయిన మీరు 17.06.2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపు కొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యందరములు లేదని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజే యడమైనది.

వాయిదా తేది : 17.06.2023

By order of the Deputy Registrar of chits
By Arbitrater, Kurnool.

Before the Honourable Deputy Registrar of Chits
By Arbitrater : Kurnool.
Dispute No:158/2022

Between :
M/s Sri Balaji Nandi Chits (P) Ltd, Nandyal.
…Disputant

Versus

1) K.Sunitamma
2) K.Krishna Rao
3) K.Tirumala Rao
4) S.Gangadhara Reddy. ...Opponents

Opponents 1 TO 4 Notices

1) K.Sunitamma W/o K.Krishna Rao, School Asst, SRKV Aided High School, Sanjeeva Nagar, Nandyal.
2) K.Krishna Rao S/o K.Mahadeva Rao, School Asst, Z.P.High School, Santhajutur (V), Bandi Atmakur (M), Nandyal. (Dist).
3) K.Thirumala Rao S/o K.Sreenivasa Rao, School Asst, S.R.K.V Aided High School, Sanjeeva Nagar, Nandyal.
4) S.Gangadhara Reddy S/o S.Chinna Gangi Reddy, S.G.Asst. S.R.K.V. Aided Primary School, Sanjeeva Nagar, Nandyal.

పై దావా నందు డిస్ప్యూట్ కంపెనీ వారు వారికి రావలసిన బాకీ మొత్తం 5,61,167/- అసలు మరియు ఖర్చులు, వడ్డీ రాబట్టు కొనుటకు గాను మీ పైన దావా దాఖలు చేసినారు. ఇందు 1 నుంచి 4 అపోనెంట్స్ అయిన మీరు 17.06.2023వ తేదిన ఉదయం 11:00 గంటలకు పై కోర్టు వద్ద హాజరు కాగలరు. మీరు గాని, మీ తరపున వకీలు గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్నచో తెలుపు కొనగలరు. లేనిచో మీకు ఎలాంటి అభ్యందరములు లేదని మీ పరోక్షమున పైన తెలిపిన దావా విచారించి తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజే యడమైనది.

వాయిదా తేది : 17.06.2023

By order of the Deputy Registrar of chits
By Arbitrater, Kurnool.